క్లుప్తంగా

మంచినీటి చెరువుకు సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో రక్షిత మంచినీటి చెరువును సాగర్ జలాలతో నింపుతున్నామని సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ తెలిపారు. ఆదివారం మంచినీటి చెరువును సర్పంచ్‌తో పాటు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోకి తాగు నీటి సరఫరా నాలుగు రోజుల పాటు నిలుపుదల చేశామన్నారు. ఎన్నెస్పీ ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడి సాగర్ జలాలు విడుదలకు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు నూతనంగా రూ.లక్ష వ్యయంతో రెండు విద్యుత్ మోటార్లతో పాటు చిన్నపాటి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయించిన అనంతరం గ్రామంలోకి తాగునీరు విడుదల చేస్తామన్నారు. గ్రామ సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, కొణతం ఏరుకలరెడ్డి, ఏసు, తదితరులు ఉన్నారు.

శరవేగంగా జలజీవన్ మిషన్ పనులు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.50 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 40 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంతో పాటు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపు (నీటిని శుద్ధి చేసి నిల్వ ఉంచేది) పనులు జరుగుతున్నాయి. ఇంటింటి నీటి కుళాయి ఏర్పాటు చేయటానికి పైపులు కూడా మంజూరు కాగా, గ్రామంలో 3 కిలోమీటర్ల మేర పైపులైను పనులు పూర్తి చేసిన తదుపరి నీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ నిధులు రూ. 2 లక్షలు, బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో అవసరమైన యంత్ర పరికరాలతో కూడిన ఆర్వో ప్లాంట్ల నిర్మాణ పనులు మండలంలోని పోట్లూరు, మతుకుమల్లి గ్రామాల్లో పనులు పూర్తి కాగా ముండ్రువారిపాలెం, కనమర్లపూడి గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని ఏఈ చెప్పారు. జలజీవన్ మిషన్ పథకంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూడావత్ ఆకాష్‌ను »సాక్షి« వివరణ కోరగా పనులు పారదర్శకంగా అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

చిలకలూరిపేట: నిరుపేదలకు వైద్య సేవలు అందించే లక్ష్యంతో రోటరీ సంస్థ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందించారు. వైద్య శిబిరంలో మందుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించిన దేవినేని అశోక్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, జాష్టి రంగారావు, తోటకూర వెంకట నారాయణ, దండా లక్ష్మీనారాయణ, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.


కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని భీమవరం రోడ్డులో గల రైల్వే ట్రాక్‌పై ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన వై.శ్రీనివాసరావు (51) కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహమైంది. కుటుంబ కలహాలు, అప్పుల కారణంగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మహిళ మెడలోని నల్లపూసల బంగారు గొలుసు అపహరణపై ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు కొరిటపాడుకు చెందిన పుష్పావతి కుమార్తెతో సత్తెనపల్లిలో బంధువుల ఇంటికి వచ్చారు. పని ముగించుకొని తిరిగి కుమార్తెతో వెళుతూ గుంటూరు బస్‌స్టాప్ సెంటర్‌లో ఆగారు. ఈలోగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి పుష్పావతి మెడలోని నాలుగు సవర్ల నల్లపూసల బంగారు గొలుసును అపహరించుకు పోయారు. దీనిపై ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ యు.శోభన్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో గుర్తు తెలియని మృతదేహం



సత్తెనపల్లి: పట్టణంలోని వావిలాల పార్కు దగ్గర గల కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద రోడ్డు మీద పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఈ నెల 27న సత్తెనపల్లి టౌన్ పోలీసులు గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ వ్యక్తి ఈ నెల 29న రాత్రి 10 గంటల సమయంలో మరణించాడు. మృతుడ్ని గుర్తించిన వారు యు. శోభన్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, సత్తెనపల్లి టౌన్ లేదా 9440796230, 08641 – 232333 నంబర్లకు సమాచారం అందించాలని ఆదివారం కోరారు.

పల్లె ముంగిటకే పరిపాలన

- సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం సాకారం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడు గ్రామ సచివాలయం -1 నూతన భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: పరిపాలనను ప్రజలకు చేరువ చేస్తూ అర్హులకు సంక్షేమ లబ్ధి అందజేయడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని..సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన అందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడు గ్రామంలోని హైవే పక్కన ఉపాధిహామీ పథకం వందశాతం నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం -1 భవనాన్ని ఆదివారం మంత్రి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడారు. సచివాలయం పరిధిలో అందిస్తున్న వివిధ సేవలను గురించి శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి రజిని మాట్లాడుతూ మహాత్ముడు కలలు గన్న గ్రామస్వరాజ్యం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఇలా ఒకటి రెండు కాదని 545 రకాల సేవలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందించడంతో పాటు ఠంచన్‌గా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఇదంతా ముఖ్యమంత్రి నాలుగేళ్ల పాలనలో ఎంతో పారదర్శకంగా కొనసాగుతుందన్న విషయాన్ని గుర్తు చేశారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రాల్లోని తహసీల్దార్, మండల పరిషత్ ఇతరత్ర కార్యాలయాలకు పనులు మానుకుని పరుగెత్తాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సచివాలయం భవనాన్ని అత్యాధునిక వసతులతో ఎంతో సుందరంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయం వ్యవస్థను తెచ్చిందన్నారు. అవినీతికి, వివక్షతకు తావు ఇవ్వకూడదని పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావాలనే ప్రధాన ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చినట్లు తెలిపారు. అనునిత్యం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రికి రానున్న రోజుల్లో అందరూ అండగా ఉండి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు కల్లూరి విజయ్‌కుమార్, నాయకులు మాదం శ్రీను, బండ్ల పున్నారావు, కర్నాట సుబ్బారావు, ఊరంగి నాగమల్లేశ్వరరావు, షేక్ షాజహాన్, బొంతా ప్రభుదాసు, కట్టా నాగార్జున, పందుల బుల్లెబ్బాయి, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, ఈఓపీఆర్డీ వరూధిని, పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు మానవతకు మాయనిమచ్చ

- యడ్లపాడులో పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనలు
- వివిధ చర్చిల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ



హైవే సర్వీసురోడ్డుపై ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

యడ్లపాడు: ఆదివాసీ మహిళలపై అత్యాచారం.. మారణ హోమం మానవతకు మాయనిమచ్చగా మిగులుతుందని పలువురు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనకు నిరసనగా మండల కేంద్రమైన యడ్లపాడులో పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత పలు చర్చిల్లో ఆదివారం జరిగే ఆరాధనలను ముగించుకుని గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయం కూడళ్ల వద్దకు క్రైస్తవులంతా చేరుకున్నారు. ముందుగా స్థానికంగా ఉన్న చర్చీల పరిధిలోని పాస్టర్లు, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొని మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రచ్చబండ సెంటర్, మెయిన్‌బజార్, 16వ నంబర్ జాతీయ రహదారి, జగ్గాపురం రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలను ధరించి, ప్లకార్డులు పట్టుకుని ఆద్యంతం శాంతి నినాదాలు చేస్తూ ప్రదర్శనను కొనసాగించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ కేవలం 28 లక్షల జనాభా గల అతి చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో అక్కడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయని మండిపడ్డారు. కుకీ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి వారిని సామూహికంగా అత్యాచారం చేయటం దేశంలో మహిళల భద్రత ఎంత ప్రమాదకరంగా ఉందో తెలియజేస్తోందన్నారు. దేశంలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని మతోన్మాద శక్తుల దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వందల మంది ప్రజల ఊచకోత, వేలాదిమంది మహిళలు అత్యాచారాలకు గురవటం మానవీయతకు మాయని మచ్చగా మిగులుతుందన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరచి మతోన్మాద మూకలను అడ్డుకోవాలని దేశ ప్రజలు శాంతియుతంగా జీవించే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో కొనసాగిన ఈ ప్రదర్శనలో లూథరన్ చర్చి పాస్టర్ ఏసురత్నం, పరిశుద్ధాత్మ సంఘం పాస్టర్ సోమయ్య, క్రీస్తు సువార్త సంఘం ఇమ్మానియేల్, ఆయా చర్చిల విశ్వసులు, సంఘస్తులు, మహిళలు, యువకులు, సండేస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

నరసరావుపేట: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ నాయకత్వంలో ఆదివారం జెండాలు చేబూని నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా రిజర్వేషన్ విషయంలో రెండుజాతుల మధ్య జరిగిన గొడవలను పురస్కరించుకొని ఒక జాతికి అక్రమంగా మద్దతు ఇస్తూ మరో జాతిపై దాడులకు మోదీ నాయకత్వంలోని బీజేపీకి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. జాతుల మధ్య వైరాన్ని సృష్టించి పబ్బం గడుపుకొనే బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే దేశమంతా మణిపూర్‌లా తయారవుతుందన్నారు. ఎస్‌ఎం భాష, సీదా కృష్ణ, రవికిషోర్, దాసరి రాజు, రమేష్, పూర్ణ ,జయపాల్,ప్రవీణ్ పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా మణిపూర్‌లో అమాయక గిరిజన తెగలపై అక్కడి మతోన్మాదులు దాడులు చేస్తున్నారని, ప్రభుత్వం హింసను నిలువరించి దుండగులను కఠినంగా శిక్షించాలని నాదెండ్ల ఎన్‌యూసీఎఫ్ కన్వీనర్ కొవ్వూరి శ్రీధర్, పాస్టర్ బి.మోహనరావు చెప్పారు. నాదెండ్లలో యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో



నాదెండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు, పాస్టర్లు

ఆదివారం శాంతిర్యాలీ నిర్వహించారు. 20 మంది పాస్టర్‌లతో నాదెండ్ల లూథరన్ చర్చి నుంచి తిమ్మాపురం రోడ్డులోని అంబేడ్కర్ కాలనీ చర్చి వరకూ శాంతిర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో క్రిస్టియన్, గిరిజనులపై మతోన్మాద దాడులు జరగటం ఆందోళనకరమన్నారు. అక్కడి బీజేపీ ప్రభుత్వం తెగల మధ్య వైరాన్ని రాజేసి హింసాకాండకు కారణమైందని ఆరోపించారు. ఇరువురు కుకీ తెగ స్త్రీలను నగ్నంగా నడిపించిన ఉదంతం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. గత కొన్నేళ్లుగా దేశంలో ముస్లింలు, క్రైస్తవులపై పథకం ప్రకారం దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంగా ఇలాంటి దుర్మార్గాలను నిలువరించాలని కోరారు. పాస్టర్ అబ్రహం, విజయకుమార్, బి.జాన్‌వెస్లీ, బి.హనోక్, బి.సుందరకుమార్, ఆర్.మోజేష్, జి.లెవీ, జేమ్స్‌పాల్, దయారత్నం, డి.మోషే, స్థానిక సంఘ పెద్దలు, యువకులు ఉన్నారు.

ఉమ్మడి సివిల్ కోడ్‌తో లౌకికవాదానికి విఘాతం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు


అమరావతి: స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో ఉమ్మడి సివిల్ కోడ్ (యూసీసీ)పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం సీపీఎం శాఖా కార్యదర్శి షేక్ మొహిద్దిన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రవిబాబు మాట్లాడుతూ విభిన్న మతాలు సంప్రదాయాలు, ఆచారాలున్న భారతీయ సమాజంలో ఏకరూప పౌర స్మృతి (యూసీసీ) సాధ్యం కాదన్నారు. 21వ లా కమిషన్ యూసీసీ అమలు చేయడం సాధ్యం కాదని, సమైక్యత, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని చెప్పినప్పటికీ బీజేపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 22 లా కమిషన్ వేసి యూసీసీ ఎలా ఉంటుందో చెప్పకుండా ప్రజల ముందుకు చర్చ తీసుకురావడం వారిని గందరగోళాలకు గురి చేయడమేనని పేర్కొన్నారు. ముస్లిం మహిళలకు విముక్తి కలిగించడానికి యూసీసీ తీసుకొస్తున్నామంటు మతాల మధ్య చిచ్చు రాజేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి బి. సూరిబాబు మాట్లాడుతూ హిందూ మతంలోనే దక్షిణాదిలో ఒకరకంగా, ఉత్తరాదిలో మరో రకమైన ఆచార, సంప్రదాయాలున్నాయని తెలిపారు. అసలు హిందూ మతంలోనే ఉమ్మడి సివిల్ కోడ్ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగంగా మాత్రమే కేంద్ర ప్రభుత్వం యూసీసీని ముందుకు తీసుకు వచ్చిందని, లౌకికవాదులు, ప్రజాస్వామ్యకువాదులు ఇటువంటి వాటిని వ్యతిరేకించాలని ఆయన కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు దారా ప్రసాద్, పలుకూరి రోశిబాబు, తాడిబోయిన సుబ్బారావు, శృంగారపాటి రాజ్ కుమార్, తల్లం ప్రదీప్, నండూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 98 శాతం దరఖాస్తులకు పరిష్కారం

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారంతో జగనన్న సురక్ష ముగిసింది. 16 రోజుల్లో 16 సచివాలయాల పరిధిలోని ఇరవై గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజల సమస్యల్ని పరిష్కరించారు. మండలంలో ప్రజల నుంచి 5,200 దరఖాస్తులు రాగా, ఇందులో 5,017 దరఖాస్తుల్ని అధికారులు పరిష్కరించారు. 98 శాతం లక్ష్యాన్ని సాధించి, ఏడు వేల కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. మండల పరిధిలోని ఇరవై గ్రామాల్లో ప్రజలకు 5,017 ధ్రువీకరణ పత్రాల్ని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అధికారులు పంపిణీ చేశారు. ఇందులో 1976 ఆదాయ, 1780 కుల, 278 రెన్యువల్ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. 472 ఆధార్ కార్డుల్లో సవరణలు, 222 బియ్యం కార్డులో చేర్పులు, 26 కౌలు గుర్తింపు కార్డులు, 17 కుటుంబాల నుంచి విడిపోవడం, 40 నూతన బియ్యం కార్డులు, 25 బియ్యం కార్డు నుంచి విడిపోవటం, 95 బియ్యం కార్డులో తొలగింపులు, మూడు రెవెన్యూ శాఖలో మ్యూటేషన్‌లు, రెండు ఈసీలు, 11 వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో మార్పులు, నాలుగు ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్లు తదితరాలు ఉన్నాయన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అర్థరాత్రి అదృశ్యం.. ఉదయం బావిలో శవమై తేలిన వైనం



మృతుడు కరీంబాబు

యడ్లపాడు: ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని కోట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం కొండవీడు గ్రామానికి చెందిన కరీంబాబు (45) కొద్దికాలంగా గుంటూరులోని ఆనందోపేట 8వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం మొహర్రం కార్యక్రమాన్ని తిలకించేందుకు స్వగ్రామానికి వచ్చారు. అదేరోజు రాత్రి 11.30 నుంచి కుటుంబ సభ్యులకు కనిపించకుండా పోయాడు. అదృశ్యమైన కరీంబాబు ఆదివారం గ్రామంలోని బావిలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. భార్య సర్తాజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. అయితే కరీంబాబు తల్లి ఇమామ్‌బీకి చెందిన 19 సెంట్ల స్థలం ఉందని, సదరు స్థలం వివాదంలో కరీంబాబును హత్యచేసి బావిలో వేసి ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.


లూథరన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం



క్రోసూరు: స్థానిక లూథరన్ చర్చిలో సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ డాక్టర్ ఎం.సుందరరావు మాట్లాడుతూ 1842లో అమెరికా మిషనరీ ఫాదర్ హెయ్యర్ లూథరన్ సంఘం తరఫున గుంటూరుకు వచ్చారన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటైన సంఘం అప్పటి నుంచి ఆధ్యాత్మిక, విద్య, వైద్య రంగాల్లో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోకూడా అనేకసార్లు సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో శాంతి కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పాస్టరమ్మ హస్పిబా, సంఘ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన

- 11 గ్రామ సచివాలయాల పరిధిలో 7,854 మంది లబ్ధిదారులకు లబ్ధి
- ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని



శావల్యాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల సహకారంతో విజయవంతం కావటం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ ఆదివారం అన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో అర్హత కలిగి, నేటి వరకు సంక్షేమ పథకాలు పొందనటువంటి లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం వరం లాంటిదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. మండలంలో 11 గ్రామ సచివాలయాలు ఉండగా కనమర్లపూడి గ్రామ సచివాలయం పరిధిలో 522 ధ్రువీకరణ పత్రాలు వేల్పూరు-1-780, వేల్పూరు-2-784, పోట్లూరు-575, పిచికలపాలెం -615, శానంపూడి-650, గుంటుపాలెం-518, శావల్యాపురం-645, కారుమంచి- 1550, కొత్తలూరు-340, మతుకుమల్లి గ్రామసచివాలయం పరిధిలో 875 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఆయా గ్రామ సచివాలయ పరిధిలో గ్రామస్తుల సమక్షంలో శిబిరాలు ఏర్పాటు చేసి పారదర్శకంగా అందజేశామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సహకారంతో విజయవంతం చేశామన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, గడిపూడి వెంకట్రాయుడు-భిక్షపతి ట్రస్టు సారథ్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య పరీక్షల శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈశిబిరంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 525 మంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, 300 మందికి శుక్లాల ఆపరేషన్లు చేయించాలని శంకర వైద్యనిపుణులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా గడుపూడి వెంకట్రాయుడు మాట్లాడుతూ ట్రస్టు సారథ్యంలో పేద ప్రజలకు సేవా చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే శుక్లములు ఆపరేషన్లు చేయించుకునే వారందరికీ వారం రోజుల వ్యవధిలో దఫాలు వారీగా ప్రత్యేక వాహనంలో వైద్యశాలకు తీసుకొని శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. శంకర వైద్యశాల వైద్యులు సాయి స్నేహ, రియా, సుస్మీత, క్యాంప్ అధికారి రవికాంత్, గ్రామవాసీ లాంఫామ్



శిబిరంలో పాల్గొన్న వారికి నేత్రపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రొఫెసర్ చెరుకూరి శ్రీనివాసరావు, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు, బాలకృష్ణ, చౌదరి, గోరంట్ల సత్యనారాయణ, చెరుకూరి ప్రసాదు, గడుపూడి కోటేశ్వరరావు, సొసైటీ డైరెక్టరు ఒంగోలు హనుమంతరావు, ఉపాధ్యాయుడు బెజవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ చెప్పారు. పట్టణంలోని ఎస్‌ఎంఎస్ గార్డెన్స్‌లో దిల్‌సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచే గొప్ప కార్యక్రమం ఇదని కొనియాడారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసుకొని ఇలాంటి సమాజ సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావడం ఆదర్శనీయమని వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొని అభినందనలు తెలిపారు. సీపీటీ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 120 మంది రక్తదానం చేశారు. దిల్‌సే ఫౌండేషన్ సభ్యులు షేక్ ఖాజా హసన్, సలీం, అబ్దుల్, రహీం, ఘన్‌సైదా, రఫీ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

ఇద్దరు పిల్లల చదువు కోసం దత్తత


సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాథ ఆశ్రమంలో పెరుగుతున్న ఇద్దరు పిల్లల్ని వారి చదువుల నిమిత్తం ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షులు కొత్త రామకృష్ణ దత్తత తీసుకున్నారు. ఆదివారం వారి చదువు కోసం యూనిఫామ్స్, పుస్తకాలు అందించారు. స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో చదువుతున్న ఈ ఇద్దరు పిల్లల్లో విష్ణు ఆరో తరగతి, అశ్విని ఐదో తరగతి చదువుతున్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అనాథ పిల్లల్ని దత్తత తీసుకుని వారి చదువులు, ఉస్తకాలు, యూనిఫామ్ అందజేస్తామని రామకృష్ణ తెలిపారు. ఆదరణ అనాథాశ్రమం నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త రామకృష్ణ ఎంతో సహకారం అందిస్తున్నారని, ప్రత్యేకించి పిల్లల చదువుల మీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తారని తెలిపారు. ప్రత్యేకించి ఈ సంవత్సరం ఇద్దరు పిల్లల్ని చదువు నిమిత్తం సుమారు రూ. 35 వేలు ఖర్చు అవుతాయని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలియజేయడంతో వారిని దత్తత తీసుకొని వారికి కావాల్సిన మౌలిక వసతులను సమకూరుస్తామని హామీ ఇచ్చారన్నారు. పిల్లల్ని దత్తత తీసుకున్న ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.



దత్తత తీసుకున్న పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న కొత్త రామకృష్ణ

లయన్‌గా ఇమ్మిడిశెట్టి సేవలు చిరస్మరణీయం

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్‌కు ఇమ్మిడిశెట్టి జగన్మోహనరావు సేవలు చిరస్మరణీయమని అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక పెన్షనర్స్ హాలులో ఆదివారం సత్తెనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇమ్మిడిశెట్టి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్‌కు ఆయన అందించిన సేవలు, సహాయసహకారాలు చిరస్మరణీయమైనవని సభ్యులు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు కంబాల వెంకటేశ్వరరావు, వై.పి.మురళీకృష్ణ, పెద్దింటి చంద్రయ్య, వి.వి.ఆర్. కృష్ణమాచార్యులు, పొత్తూరి రామకోటయ్య, గ్రంధిశిల శ్రీనివాసరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, తిరుమల శ్రీనివాస్, డాక్టర్ నరసింహారావు, తవిటి భావన్నారాయణ పాల్గొన్నారు.



ఇమ్మిడిశెట్టి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ఆదివారం ఉద యం అధిక మాసం ఏకాదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర పారాయణం జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.